# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 244 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శుక్రవారం 1 మే 2026 | ఎడిటర్: ఎం.వనిత రెడ్డి


# పోలీస్ అకాడమీలో డీజీపీ శివధర్‌రెడ్డికి గౌరవ వీడ్కోలు

**32 ఏళ్ల పోలీసు కెరీర్‌లో ఎన్నో అనుభవాలు, జ్ఞాపకాలు : డీజీపీ శివధర్ రెడ్డి**

**పోలీస్ అకాడమీలోని పరేడ్ గ్రౌండ్‌లో శివధర్‌రెడ్డికి గౌరవ వందనం**

**కార్యక్రమంలో పాల్గొన్న నూతన డీజీపీ సీవీ ఆనంద్**

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)

తన 32 ఏళ్ల సుదీర్ఘ పోలీస్ జీవితంలో అనేక అనుభవాలు, జ్ఞాపకాలు మిగిలాయని రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పదవీ విరమణ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ అకాడమీలోని పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు ఉన్నతాధికారులు ఆయనకు గౌరవ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శివధర్‌రెడ్డి మాట్లాడుతూ తనను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాత పోలీసింగ్ విధానాలతో పోలిస్తే ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నో మార్పులు వచ్చాయని అన్నారు. పోలీస్, ప్రజల మధ్య దూరం తగ్గించేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పోలీసింగ్ చేపట్టినట్లుగా తెలిపారు. డీజీపీగా అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. యువ పోలీస్ అధికారులు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నూతన డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్‌కు శివధర్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.

"32 ఏళ్ల సుదీర్ఘ పోలీస్ జీవితంలో ఎన్నో అనుభవాలు, ఎన్నో జ్ఞాపకాలు, తీపిగుర్తులు, ఒత్తిడిలు. అన్నింట్లోనూ నాతో ముందుడి, పక్కనుంచి నడిపించి వెన్నుతట్టి నడిపినటువంటి సీనియర్స్‌కు ధన్యవాదాలు. వారు చూపించిన పథంలోనే పోలీస్‌శాఖ నడుస్తుందని భావిస్తున్నాను. ఒకప్పటితో పోలిస్తే పోలీసింగ్‌లో ఎన్నో మార్పులు వచ్చాయి"– శివధర్ రెడ్డి, డీజీపీ

ఎన్నో విశిష్ట సేవలందించారు : పదవీ విరమణ పొందుతున్న డీజీపీ శివధర్‌రెడ్డికి, నూతన డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 32 ఏళ్లపాటు శివధర్‌రెడ్డి ప్రజలకు ఎన్నో విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో కీలకంగా పని చేశారని, ఎన్‌కౌంటర్లు, మావోయిస్టుల సరెండర్‌లోనూ ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆపరేషన్ కగార్‌ను విజయవంతంగా అమలు చేసినట్లుగా వివరించారు."భారీగా మావోయిస్టుల ఆయుధాల స్వాధీనం, లొంగుబాటు సాధన కోసం శివధర్ రెడ్డి కృషి చేశారని సీవీ ఆనంద్ అన్నారు.



# 'టీఆర్ఎస్ నాకే రాసిపెట్టి ఉందేమో'

## కవిత పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'కు ఈసీ గుర్తింపు

**టీఆర్ఎస్ పేరును అధికారికంగా కవిత పార్టీకి ఇచ్చిన ఈసీ**

**తెలంగాణ రక్షణ సేన పేరును ఆమోదించిన ఈసీ**

**ఈనెల 25న టీఆర్ఎస్ పార్టీ పేరు ప్రకటించిన కవిత**



హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)

కల్వకుంట్ల కవిత పార్టీ 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)'కు ఆమోద ముద్ర వేసింది. తెలంగాణ రక్షణ సేన పేరును ఈసీ ఆమోదించింది. ఈ నెల 25న పార్టీ పేరు తెలంగాణ రాష్ట్ర సేనగా ప్రకటించారు. అయితే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పేరును ఈసీ ఆమోదం తెలిపింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు లేఖ అందజేశారు. ఆరంభంలో తెలంగాణ ప్రజా జాగృతి, తెలంగాణ జాగృతి, తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ రాష్ట్ర జాగృతి, తెలంగాణ ప్రజాశక్తి తదితర పేర్లలో ఒక పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కవిత కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు.

తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తా : తెలంగాణ రక్షణ సేన పేరుకు ఈసీ ఆమోదంపై కవిత హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్‌కు ఈసీ ఆమోదం తెలిపిందని ఎక్స్ వేదిగా తెలిపారు. సమస్త తెలంగాణ సమాజానికి తెలియచేయడానికి సంతోషిస్తున్నానని, జనవరిలో ఈసీ నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేశామని అన్నారు. మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నామని, మూడో ప్రాధాన్యతగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించిందని వెల్లడించారు. టీఆర్ఎస్ తనకు రాసిపెట్టి ఉందేమో అని తెలిపారు. రెండు దశాబ్దాలుగా చేస్తున్న కృషిని కొనసాగిస్తానని, తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తానని స్పష్టం చేశారు.

# సంక్షేమశాఖపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్ష

## సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో జవాబుదారీతనం

**విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి**

**వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు**

**ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి**

**సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)

విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు

**మొదటి పేజీ తరువాయి...**

అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెటటెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, బిసి కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

# మే 10న హైదరాబాద్ వస్తున్న ప్రధాని

## కీలక విషయాలను వెల్లడించిన కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)



తెలంగాణ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ మే 10వ తేదీన తెలంగాణలో పర్యటించనున్నట్లు ఆయన మీడియాకు తెలియజేశారు. ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారిగా తెలంగాణకు రానుండటంతో... ఈ పర్యటనపై అటు రాజకీయంగా, ఇటు పాలనాపరంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో రైల్వే వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు రూ. 85 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని కిషన్ రెడ్డి తెలిపారు. అలాగే, ములుగులో ఏర్పాటు చేయనున్న సమ్మక్క – సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు కూడా త్వరలోనే పట్టాలెక్కనున్నాయని వెల్లడించారు. వరంగల్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రధాన మంత్రి కాకతీయ టెక్స్‌టైల్ పార్కు'ను వేగంగా అభివృద్ధి చేస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా మంజూరైన ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కుల్లో ఇది ఒకటని చెప్పారు. ఈ పార్కు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ప్రధాని పర్యటన సందర్భంగా హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సభకు 3 లక్షల మందిని తరలించాలని రాష్ట్ర బీజేపీ నాయకత్వం భావిస్తోంది.

# ఇరాన్ అణు ఒప్పందానికి రావాల్సిందే

## అప్పటి వరకు శాంతి ఒప్పందం కుదరదు

**మరోమారు హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

వాషింగ్టన్,ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)

దాదాపు రెండు నెలలుగా కొనసాగుతున్న ఘర్షణను ముగించాలనే ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించాలంటే తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. అప్పటివరకు ఇరాన్‌పై అమెరికా నౌకా దిగ్బంధనం కొనసాగు తుందని హెచ్చరించారు బుధవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్.. ఇరాన్ యుద్ధం గురించి మాట్లాడారు. 'బాంబు



దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతోంది. వారు రాజీ పడాలనుకుం టున్నారు.

# తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా వీహెచ్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా తనకు నెలకు రూ.1 లక్ష వేతనం వస్తుందని, తన రెండేళ్ల పదవీ కాలంలో వచ్చే మొత్తాన్ని ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్న విద్యార్థుల కోసం ఇస్తానని వి. హనుమంతరావు ప్రకటించారు. కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్‌ను తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా (బీసీ సంక్షేమం, అభివృద్ధి) నియమించిన విషయం తెలిసిందే. ఆయనకు కేబినెట్ హోదా ఉంటుంది. ఈరోజు ఆయన మాట్లాడుతూ, తన పదవీ కాలం రెండేళ్ల పాటు ఉంటుందని, ప్రతి నెల రూ.1 లక్ష వేతనం వస్తుందని తెలిపారు. ఈ మొత్తాన్ని పేద విద్యార్థులకు అందించేలా ట్రస్టులకు ఇస్తానని హామీ ఇచ్చారు. తనకు కీలక పదవిని అప్పగించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను ఏది అడిగినా కాంగ్రెస్ పార్టీ కాదనలేదని పేర్కొన్నారు.

# అధికారుల అనైతిక వ్యాపారం - విద్యార్థుల డేటా అమ్మకం..!

**ఫోన్ కాల్స్ తో విసిగిపోతున్న**

**తల్లిదండ్రులు ... సమాచారం అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్న అధికారులు**

**హైదరాబాద్, ఏప్రిల్ 30, (నమస్తే ఉదయం):**

తెలంగాణ విద్యా వ్యవస్థలో పరీక్షా ఫలితాలు విడుదలైన తర్వాత ప్రతి సంవత్సరం ఏర్పడే ఒక అనైతిక చర్య, వాణిజ్యీకరించిన వైనం గురించి విశ్లేషణాత్మక ధోరణిలో గమనిస్తే, ఇది కేవలం కొన్ని ఫోన్ కాల్స్ లేదా డేటా లీక్ కాదు ఇది విద్యార్థుల భవిష్యత్తును వ్యాపారం గా మార్చి, తల్లిదండ్రుల మానసిక స్థితిని అలుసుగా తీసుకుని లాభం కోసం దోచుకునే ఒక వ్యవస్థాపక రోగం అని చెప్పుకోవచ్చు. ప్రభుత్వ విద్యాశాఖలో (ముఖ్యంగా స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో) ఉన్న అధికారులు లేదా సిబ్బంది తమ వద్ద ఉన్న విద్యార్థుల వ్యక్తిగత సమాచారం(పేరు, ఫోన్ నంబర్, ఇమెయిల్, తండ్రి పేరు, స్కూల్ వివరాలు, మార్కులు/ర్యాంకులు) రాష్ట్ర వ్యాప్తంగా అమ్ముతున్నారు. ఇలాంటి డేటా అమ్మకాల వైనాల గురించి భారతదేశంలోనే అనేకసార్లు ఎన్నో ఉదంతాలు బయటపడ్డాయి. తమిళనాడు స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు కూడా గతంలో ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఒక్కో స్టూడెంట్ డేటా 2 నుంచి 5 రూపాయల వరకు అమ్ముకున్నట్లు గతంలో రిపోర్టులు కూడా వెలుగులోకి వచ్చాయి. తాజాగా ఇప్పుడు ఎస్ ఎస్ సి లేదా ఇంటర్ ఫలితాలు వచ్చిన తర్వాత ఈ డేటా మరింత విలువైనది గా మారుతుంది. ఎందుకంటే తల్లిదండ్రులు ఆందోళనలో, భయంతో ఉంటారు"మా పిల్లవాడికి ఏ స్కూల్‌లో అడ్మిషన్ వస్తుంది? ఇంకా ఏమైపోతాడు?" అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో ఈ భావోద్వేగ బలహీనతను లక్ష్యంగా చేసుకుని, కార్పొరేట్ స్కూళ్ల డేటా కొనుగోలు చేసి టార్గెటెడ్ మార్కెటింగ్ చేస్తుంటాయి. ఇది స్పష్టమైన గోప్యతా ఉల్లంఘన మాత్రమే కాదు, ప్రభుత్వ అధికారులు తమ స్వంత ప్రజలను (పిల్లలను) లాభం కోసం అమ్ముకోవడం ఇది నైతికంగా అత్యంత హీనమైన చర్య. విద్యార్థి డేటా రక్షణకు ఏదైనా బలమైన చట్టం లేకపోవడం, లేదా ఉన్న చట్టాల అమలు లోపం వల్ల ఇలాంటి అనైతిక వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ప్రభవిల్లుతోంది . డేటా ఒక్కసారి లీక్ అయితే, అది డార్క్ వెబ్ వరకు కూడా చేరి మరిన్ని దుర్వినియోగాలకు దారి తీస్తుంది కూడా.

**కార్పొరేట్ విద్యాలయాలు --- ఫోన్ కాల్స్ ద్వారా మానసిక వేదన**

పరీక్షా ఫలితాలు విడుదలైన వెంటనే (ఎస్ ఎస్ సి/ఇంటర్ రిజల్ట్స్ తర్వాత) కార్పొరేట్ స్కూళ్లు, కోచింగ్ సెంటర్లు తల్లిదండ్రుల ఫోన్లను మోత మోగించడం మొదలవుతుంది. "మీ పిల్లవాడి మార్కులు చూశాం, మా స్కూల్‌లో అడ్మిషన్ తీసుకోండి... ఫీజు ఎక్కువైనా మా ఫెసిలిటీస్ అద్భుతం..." అని రోజుకు పదుల సార్లు కాల్స్ వస్తాయి. కొన్ని స్కూళ్లు డేటా కొని, ర్యాంక్ ఆధారంగా ప్రత్యేకంగా టార్గెట్ చేస్తాయి. ఇది సాధారణ మార్కెటింగ్ కాదు ఇది ఒక మానసిక వేదన. ఫలితాల తర్వాత తల్లిదండ్రులు ఇప్పటికే ఆందోళన, నిరాశ, ఒత్తిడితో ఉంటారు. పిల్లలు మార్కులు తక్కువ వచ్చినా లేదా ఆశించినంత రాలేకపోయినా, కుటుంబంలో టెన్షన్ ఉంటుంది. ఆ సమయంలో వచ్చే ఈ కాల్స్ వారిని మరింత క్షోభకు గురి చేస్తాయి. కొందరు తల్లిదండ్రులు ఫోన్ సైలెంట్ పెట్టి, లేదా నంబర్ బ్లాక్ చేయాల్సి వస్తుంది. ఇంకా కొందరు ఒత్తిడికి తట్టుకోలేక పిల్లలపై మరింత ఒత్తిడి పెడతారు. కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారం గా చూస్తున్నాయి. అడ్మిషన్ సీజన్‌లో ఫీజు పెంపు, అనవసరమైన ప్రకటనలు, ఏకపక్ష మూల్యాంకన పుస్తకాలు,యూనిఫాం బలవంతం గా అంటగట్టి వారి వ్యాపార మనస్తత్వం లో ఒక భాగం. ప్రభుత్వం ఫీజు రెగ్యులేషన్ కమిటీ ఉన్నా, అమలు బలహీనంగా ఉండటం వల్ల ఈ సమస్య కొనసాగుతోంది.

**నైతిక వైఫల్యం**

విద్యాశాఖ అధికారులు ప్రజా సేవకులు కావాలి, కానీ వారు డేటా బ్రోకర్లుగా మారడం ద్వారా విద్యా వ్యవస్థలోని నమ్మకాన్ని ధ్వంసం చేస్తున్నారు. పిల్లల డేటా రక్షణ అధికారుల యొక్క ప్రాథమిక బాధ్యతలో ఓభాగం. దీన్ని అమ్మడం అంటే ప్రభుత్వం తన పౌరులకే ద్రోహం చేయడం క్రింద లెక్క.

**విద్యా వాణిజ్యీకరణ**

కార్పొరేట్ స్కూళ్లు ఫలితాలను పెట్టుబడికి లాభాలు రాబట్టే అవకాశాలుగా చూస్తున్నాయి. విద్య గురించి కాకుండా, లాభాల గురించి ఆలోచిస్తున్నాయి. ఇది సమాజంలో అసమానతలను పెంచుతుంది.

**మానసిక ప్రభావం**

ఫలితాల తర్వాత ఇప్పటికే ఆత్మహత్యా ఆందోళనలు, మానసిక ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఫోన్ కాల్స్ పిల్లలు, తల్లిదండ్రుల మానసిక ఆరోగ్యాన్ని మరింత దెబ్బతీస్తాయి. విద్య అనేది ఒత్తిడి కాకుండా అభివృద్ధి సాధనం కావాలి, కానీ ఇప్పుడు అది భయంగా మారి వ్యాపార వాణిజ్య వ్యవస్థగా అవుతోంది.

**ఇప్పుడు ఏమి చేయాలి?**

తల్లిదండ్రులు డేటా దుర్వినియోగం గురించి సైబర్ క్రైమ్ పోలీసులకు లేదా రైట్ టు ఇన్ఫర్మేషన్ ద్వారా ఫిర్యాదు చేయాలి. ప్రభుత్వం డేటా ప్రొటెక్షన్ లా అమలు చేయాలి, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కార్పొరేట్ స్కూళ్లపై ఫోన్ మార్కెటింగ్‌కు నియంత్రణలు రావాలి. ఫీజు నియంత్రణ , అడ్మిషన్ ప్రక్రియలో పారదర్శకత తప్పనిసరి. కావాలి.

ఈ వ్యవస్థ లో మార్పు కావాలి విద్యను లాభం కోసం కాకుండా, పిల్లల భవిష్యత్తు కోసం చూడాలి. ఇది కేవలం ఒక సీజనల్ సమస్య కాదు,ఇది నిత్యం జరిగే మన విద్యా వ్యవస్థ యొక్క అనైతిక విజయం. దీన్ని అధిగమించడానికి విద్యార్థుల ఉత్తీర్ణత పై అంచనాలు లేని విధానం రావాలి. ఒత్తిడి లేని విద్య, తల్లిదండ్రులు పిల్లలకు స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే అవకాశాలు కూడా ఇవ్వాలి. స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యాకుసుమాలు వికాసం చెందేలా విద్యాధికులు మార్గదర్శకాలు చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# లీగల్ నోటీసులు పంపించి బెదిరిస్తే భయపడం

**శాఖా పరమైన విచారణ జరిపి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి**

**ఉపాధ్యాయ సంఘ నాయకులకు, విలేకర్లకు పంపిన లీగల్ నోటీసులను బేషరతుగా అతడు వాపస్ తీసుకోవాలి**

**ఉపాధ్యాయ విద్యార్థి, ప్రజా సంఘాల నాయకుల డిమాండ్**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)**

జనగామ జిల్లాలోని దేవరుప్పుల మండల కేంద్రంలోని బాలయేసు ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ జేసురాజు స్థానిక ఎంఈఓ, ఎంఆర్సీ సిబ్బంది పై దౌర్జన్యం చేసి, మరి ఉపాధ్యాయ సంఘ నాయకులకు, రిపోర్టర్లకు లీగల్ నోటీసులు పంపిన బెదిరింపు చర్యలను నిరసిస్తూ పాఠశాల కరస్పాండెంట్ జేసురాజు మీద పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని దేవరుప్పుల మండల కేంద్రంలోని బాలయేసు ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ జేసురాజు దౌర్జన్య ప్రవర్తనను ఖండిస్తూ అధికారులు ఆ పాఠశాల పైన సమగ్ర దర్యాప్తు జరిపి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉపాధ్యాయ, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు సంయుక్తంగా ప్రెస్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల బాధ్యులు మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా సెలవు రోజుల్లో పాఠశాల నిర్వహిస్తున్న విషయాన్ని నిర్ధారించుకోవడానికి పాఠశాల సందర్శనకు వెళ్లిన మండల విద్యాశాఖ అధికారి కళావతి పై దాడి చేసిన విషయాన్ని, వార్త రాసిన పత్రికా విలేకరులకు, మండల విద్యాశాఖ అధికారికి అండగా నిలిచిన ఉపాధ్యాయ సంఘాల బాధ్యులకు లీగల్ నోటీసులు పంపించి భయపెట్టాలని చూస్తున్న బాలయేసు ఇంగ్లీష్ మీడియం ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ జేసురాజు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సెలవు రోజుల్లో పాఠశాలను నడిపి తప్పు చేయడమే కాకుండా



విలేకరుల సమావేశంలో పాల్గొన్న, విద్యార్థి, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు

ఆ విషయాన్ని పరిశీలించడానికి సందర్శనకు వెళ్ళిన స్థానిక మండల విద్యా శాఖాధికారి డాక్టర్ కళావతి పై వెంట ఉన్న ఎంఈఆర్సి సిబ్బంది సిఆర్పీ యాకస్వామి పై దాడి చేసి ఫోన్లు లాక్కుని, బెదిరింపు లకు పాల్పడి నేరం చేయడ మే కాకుండా, ఆ వార్త రాసిన విలేఖరులకు, అండగా నిలబడ్డ ప్రజా సంఘాల బాధ్యులకు లీగల్ నోటీస్ లు పంపి బాలయేసు కరస్పాండెంట్ తన దురహంకారాన్ని, ఆధిపత్య స్వభావాన్ని మరోసారి ప్రదర్శించాడని వారంతా మండిపడ్డారు. లీగల్ నోటీసులు పంపిస్తే భయపడమని, అతని పై చర్యలు తీసుకునే దాకా పోరాటం చేస్తామని నినదించారు. ఎంఈవో పై, సిఆర్పి పై కరస్పాండెంట్ జేసురాజు దాడి చేసిన ఘటన నేపథ్యంలో సమాజంలో ఆ పాఠశాల గురించి విస్తృతమైన చర్చ జరుగుతున్నదని, జనగామ, హైదరాబాద్ ప్రాంతాల కంటే ఎక్కువ స్థాయిలో ఫీజులు వసూలు చేస్తున్నారని, అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, ఎగ్జామ్ ఫీజు, బస్ ఫీజు, పాఠశాల డెవలప్మెంట్ ఫీజు వంటి పేర్లతో తల్లిదండ్రుల నుండి అత్యధికంగా డబ్బు వసూలు చేస్తున్నారని, విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రైవేటు పుస్తకాలు, నోట్స్, యూనిఫాం పేరుతో ఎక్కువ మొత్తంలో దోచుకుంటున్నా రని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఒక ప్రభుత్వ అధికారికే రక్షణ లేని పరిస్థితి చాలా అన్యాయమని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పాఠశాల గుర్తింపు, సెక్షన్ పరిమితులు, పదవ తరగతి విద్యార్థులకు రెసిడెన్షియల్ అనుమతి, ఉపాధ్యాయుల అర్హతలు, పాఠశాల బస్సులు, వాటి డ్రైవర్ల అర్హతలు, అటెండెంట్లు ఉన్నారా..? పాఠశాలలో విద్యార్థులకు గల సౌకర్యాలు తదితర అంశాల పైన సమగ్రమైన దర్యాప్తు జరిపించి, ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘించిన పక్షంలో ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని, ముఖ్యంగా కరస్పాండెంట్ జేసురాజు ఆధిపత్యం, నేరపూరిత ప్రవర్తనను నియంత్రించా లని, అతని పైన చట్ట పరమైన చర్యలు తీసుకోవా లని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఎంఈవో పై దాడి చేసిన బాలయేసు కరస్పాండెంట్ పైన పోలీసులు కఠిన చర్యలు తీసుకొని పక్షంలో ఈ విషయమై జిల్లా స్థాయి లో, రాష్ట్ర స్థాయిలో కూడా ఐక్య కార్యాచరణ రూపొందించి పోరాటం చేస్తామని, ఉపాధ్యాయ సంఘానికి, విలేకర్లకు పంపిన లీగల్ నోటీసులను బేషరతుగా అతడు వాపస్ తీసుకోవాలని, విద్యార్థి ఉపాధ్యాయ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగారపు రమేష్, బిఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి మబ్బు ఉదయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సుమ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్, బిఎస్పి కోశాధికారి తాండ్ర అఖిల్, ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నరసింహ, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిర్రు నాగేశ్వర్, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జనగామ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండి.షరీఫ్, ఇ.రాంరెడ్డి, డిటిఎఫ్ మండల నాయకుడు గైని శంకరయ్య, యుటిఎఫ్ మండల ప్రతినిధి సూర్జిత్, డిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు చిత్రాల శ్రీనివాస్, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మార్కెట్ డైరెక్టర్ ఎం వెంకటేశ్వర రెడ్డి

**కొత్తకోట, ఏప్రిల్ 30(నమస్తే ఉదయం) హైదరాబాద్**

లో తుర్కయంజాల్ పరిణయ కన్వెన్షన్ హాల్ నెంబర్ వన్ లో అడ్డాకుల మండల్ బలీదుపల్లి గ్రామానికి చెందిన కోట్ల సువర్ణ జ్ఞానేశ్వర్ రెడ్డి కుమార్తె హర్షిత కు కొత్తకోట మండలం రాయనిపేట గ్రామానికి చెందిన చిన్నయ్య గారి జ్యోతి భాస్కర్ రెడ్డి కుమారుడు రాహుల్ రెడ్డి వివాహం జరిగింది. ఈ వివాహ వేడుకల్లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాజీ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి, ఏదుల గ్రామానికి చెందిన టైగర్ శేషి రెడ్డి, వల్లభాపురం ప్రతాపరెడ్డి, పెబ్బేర్ దయానందరెడ్డి, యుగంధర్ రెడ్డి ,సత్యనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.





# శుభకార్యాలలో పాల్గొన్న మాజీ మార్కెట్ చైర్మన్ మూలమల్ల రాజేశ్వరమ్మ భీమ్ రెడ్డి

**కొత్తకోట, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)**

ఆత్మకూరు మండలం తూము పల్లి గ్రామానికి చెందిన గొంది జ్యోతి బాలవర్ధన్ రెడ్డి దంపతుల పుత్రిక కళ్యాణి వివాహం యశ్వంత్ రెడ్డితో జరిగింది. విలియం కొండ జేవియర్ ఫంక్షన్ హాల్ లో వైభవంగా జరిగిన పెళ్లి వేడుకలో వనపర్తి రోడ్డు మాజీ మార్కెట్ చైర్మన్ మూలమల్ల రాజేశ్వరమ్మ భీమ్ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా కోర్టు మాజీ అడిషనల్ పిపి హర్షవర్ధన్ రెడ్డి, అనురాధ అభినవ రెడ్డి నాయకు లు గుర్రం గడ్డ



మాజీ సర్పంచ్ పి సర్వోత్తమ్ రెడ్డి, మూలమల్ల యుగంధర్ రెడ్డి, సరస్వతి లు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



అనంతరం కొత్తకోట మండలం అప్పరాల గ్రామం అయ్యగారి రవి కుమార్ రెడ్డి విజయ దంపతుల కుమార్తె శిరీష ల నిశ్చితార్థం కొత్తకోట లోని సాయి బంకెట్ హాల్ జరిగింది. ఈ నిశ్చితార్థ కార్యక్రమంలో మదనాపురం మార్కెట్ చైర్మన్ రాజేశ్వరమ్మ భీమ్ రెడ్డి విక్రమ్ సింహ రెడ్డి లు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.



## నేరాల నిర్మూలనకై, శాంతి భద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం : డీఎస్పీ వై. మొగిలయ్య


**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)**

జోగులాంబ గద్వాల్ జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గద్వాల్ డీఎస్పీ వై. మొగిలయ్య ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మల్దకల్ మండలం అమరావాయి గ్రామంలో ఆకస్మికంగా కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం (కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం) నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుమారు 65 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని గ్రామంలో నివసిస్తున్న వారి వివరాలు సేకరించారు. అలాగే గ్రామంలో కొత్త వ్యక్తులు ఎవరైనా నివసిస్తున్నారా, అనుమానాస్పద వ్యక్తులు ఉన్నారా అనే అంశాలపై పరిశీలన చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటో, ఒక ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వై. మొగిలయ్య స్థానిక ప్రజలతో మాట్లాడుతూ..... నేరాల నిర్మూలన, ప్రజల రక్షణ, ప్రజల్లో భద్రతాభావంహో కల్పించడమే లక్ష్యంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాలనీల్లోకి కొత్తగా వచ్చిన వ్యక్తులు, నేరస్తులు గ్రామంలో షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం ఈ కార్యక్రమాల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. 'అరైవ్ అలైవ్' ప్రత్యేక అవగాహన కార్యక్రమశీలోభాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి,ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం లోపించడం వంటి కారణాల వల్ల జరుగుతున్న ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రమాద బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలను ఉదాహరణలతో వివరించి, చిన్న జాగ్రత్తలు ఎంతటి ప్రాణనష్టాన్ని నివారించగలవో తెలియజేస్తున్నారు.హొ వాహనాలు నడిపేటప్పుడు అవసరమైన అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మహిళలు, చిన్న పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఆపద సమయంలో వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల రక్షణ కొరకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. గ్రామంలో స్వీయ రక్షణ కోసం స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలోహొగద్వాల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి. శ్రీను , గద్వాల్ సర్కిల్‌హొఎస్సైలు శ్రీహరి, శ్రీకాంత్, కళ్యాణ్ కుమార్, నందికర్, శేఖర్ గౌడ్, శ్రీనివాస్,జహంగీర్,సర్కిల్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి జయంతి

**పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన దొడ్ల వెంకటేష్ గౌడ్**

**కూకట్ పల్లి, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)**



శ్రీశ్రీశ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి జయంతి సందర్భంగా అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసి నగర్ కాలనీ లోని శ్రీ లీలాద్రి క్షేత్ర శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ చైర్మన్ మాధవరం కాంతారావు ఆహ్వానం మేరకు డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బి.వెంకటేష్ గౌడ్, పోశెట్టిగౌడ్, ఎస్.యాదగిరి, భక్తులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూహెచ్‌లో క్రమశిక్షణ అమలులో లోపాలు

**సస్పెండ్ అయిన విద్యార్థులు యథేచ్ఛగా క్యాంపస్‌లో సంచారం**

**పీహెచ్డీ స్కాలర్స్ పితాని సందీప్ గౌడ్, చల్లా రామకృష్ణ రెడ్డి**

**కూకట్ పల్లి, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)**




జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ లో క్రమశిక్షణ అమలులో తీవ్రమైన లోపాలు వెలుగులోకి వస్తున్నాయి. 23-04-2026న విడుదలైన అధికారిక సర్క్యులర్ ప్రకారం, 11-03-2026న వాలీబాల్ కోర్ట్ సమీపంలో జరిగిన గొడవలో పాల్గొన్న ఇద్దరు విద్యార్థులు బి. రాహుల్ నాయక్ (21011హొ0405), 5వ సంవత్సరం ఐడీపీ (సిఇసి) జి. సాగర్ (24011హొ0556), 2వ సంవత్సరం ఐడీపీ (సిఎస్సి)పై 6 నెలల పాటు సస్పెన్షన్ విధిస్తూ కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ నిర్ణయం యాదృచ్ఛికంగా తీసుకోబడింది కాదు. 8 మంది సీనియర్ ప్రొఫెసర్లు, 4 సార్లు కమిటీ సమావేశాలు నిర్వహించి, పూర్తి స్థాయి విచారణ చేసి, రాహుల్, సాగర్ బీటెక్ 1 ఇయర్ విద్యార్థులను కొట్టారు అని తేల్చి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఈ కమిటీ నిర్ణయాన్ని పూర్తిగా పట్టించుకోకుండా, సంబంధిత విద్యార్థులు ఇప్పటికీ హాస్టల్స్‌లోనే ఉండి, క్యాంపస్‌లో స్వేచ్ఛగా తిరుగుతూ, మునుపటిలాగే గొడవలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది యూనివర్సిటీ క్రమశిక్షణను దెబ్బతీసే చర్యగా విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు. అధికారిక సస్పెన్షన్ ఆదేశాల స్పష్టమైన ఉల్లంఘన, హాస్టల్, క్యాంపస్ నియమావళి నిర్లక్ష్యం, యూనివర్సిటీ ప్రతిష్టకు భంగం, ఇతర విద్యార్థుల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. విద్యార్థి లోకం అభిప్రాయం ప్రకారం, ఇలాంటి ఆదేశాలను పట్టించుకోని విద్యార్థులపై టీసీ (ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్) ఇచ్చి యూనివర్సిటీ నుండి పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా, ఈ ఇద్దరు విద్యార్థులు హాస్టల్స్‌లోనే కొనసాగుతున్నందున, హాస్టల్ వార్డెన్లు, కేర్ టేకర్లు దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుంది. వారిని తక్షణమే హాస్టల్ నుండి బయటకు పంపాలని విద్యార్థులు కోరుతున్నారు. యూనివర్సిటీ భద్రతా వ్యవస్థపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ (ఎస్ కె ఎస్ ఎస్) ఈ ఇద్దరు విద్యార్థులను క్యాంపస్‌లోకి అనుమతిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో, అలాగే ఎస్ కె ఎస్ ఎస్ మీద వస్తున్న వరుస కథనాలకు గాను, వారి పాత్రపై కూడా విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ మేనేజ్‌మెంట్‌ను కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పీహెచ్డీ విద్యార్థులు, పితాని సందీప్ గౌడ్, చల్లా రామకృష్ణ రెడ్డి, జయరాం ప్రిన్సిపాల్ నరసింహను కలిసి సంఘటనలు వివరించి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తూ, ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీ జారీ చేసిన ఆదేశాలు అమలు కాకపోవడం విద్యాసంస్థ ప్రతిష్టను దెబ్బతీసే అంశమని పేర్కొంటూ, క్రమశిక్షణను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

# రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల, ఆర్టీసీ బస్సు డిపోలలో ఉద్యోగుల పదవీ విరమణ సభలు





జె క్రిస్టఫర్ రాజు ను సన్మానిస్తున్న అధికారులు, స్నేహితులు



**బుద్వేల్, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఆరుగురు సిబ్బందిని గురువారం సాయంత్రం డిపో మేనేజరు బి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ప్రతి ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ అనేది సహజమేనన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారి జీవితాలలో సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐష్టశ్వర్యాలను ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన పుస్తకాల శ్రీశైలం, వడ్డె చంద్రయ్య (కండక్టర్లు), కె క్రిష్ణారెడ్డి (మెకానిక్), జి సురేందర్, సయ్యద్ గౌస్, ఎండీ షర్ఫుద్దీన్ (డ్రైవర్లు) విధి నిర్వాహణ లో ఎంతో కష్టపడి నమ్మకంగా పనిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మెకానికల్ ఫోర్మెన్ నీలిమ, ఉద్యోగ సంఘం నాయకులు ఎంహెచ్ అలీ, అంజయ్య, ఏపీ రెడ్డి లతో పాటు పుస్తకాల శ్రీశైలం స్నేహితులు అక్కిరాజు సుబ్బారావు, కృష్ణారావు, క్రిష్ణారెడ్డి, సీకె రమేశ్, ఎం విజయ్ కుమార్, పి శ్రీనివాస్ గౌడ్, సి అశోక్, పి రవీందర్, ఉమేశ్, జి నర్సింహ్మా, ఎ భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాల శ్రీశైలం దంపతులను సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు, స్నేహితులు



ఉద్యోగ విరమణ సభలో మాట్లాడుతున్న వడ్డే చంద్రయ్య

**వ్యవసాయ విశ్వవిద్యాలయంలో**

వ్యవసాయ కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ యూనివర్శిటీ హెడ్ అండ్ ప్రొఫెసర్ అజీజుద్దీన్ మహమూద్ తో పాటు రికార్డు అసిస్టెంట్ గా పనిచేస్తున్న జె క్రిష్టఫర్ రాజు లను వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందిన అజీజుద్దీన్ మహమూద్, జె క్రిష్టఫర్ రాజుల సేవలను కొనియాడారు. విధి నిర్వాహణలో బాధ్యతాయుతం గా, నిస్వార్థంగా సేవలందించారన్నారు. వారి శేష జీవితం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఉద్యోగులు, రాజేంద్రనగర్ పాస్టర్స్ పెలోషిప్ పాలకమండలి సభ్యులు ప్రణీత్ బాబు, గుంటి డానియేల్, యేసన్న, మోజెస్ లు పాల్గొన్నారు.

## నూతన డిజిపికి స్వాగతం

**పూర్వపు డిజిపి కి వీడ్కోలు.. రాష్ట్ర డిజిపి కావడం గౌరవంగా భావిస్తున్నా:సివి ఆనంద్**

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)**

సి.వి. ఆనంద్, ఐ.పి.యస్, తెలంగాణ రాష్ట్ర కొత్త డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గా బాధ్యతలు స్వీకరించనున్న సందర్భంగా తన భావాలను వ్యక్తం చేశారు.ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ నాయకత్వ బాధ్యతలు స్వీకరించడం తనకు గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. బి. శివధర్ రెడ్డి సేవలందించిన అసాధారణ ప్రతిభకు, శాఖ అభివృద్ధికి చేసిన విలువైన కృషికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు , గౌరవాభివందనాలు తెలిపారు. ఆర్బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన వీడ్కోలు పరేడ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1980లు 1990ల కాలంలో రాష్ట్రంలో నక్సలైట్ సమస్యలు తీవ్రమైన స్థాయిలో ఉండేవని గుర్తు చేశారు. ఆ



సమయంలో ఆ సమస్యను నియంత్రించేందుకు గ్రేహౌండ్స్ , స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) వంటి ఎలైట్ బలగాలు ఏర్పాటు చేయబడి సమర్థవంతంగా పనిచేశాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ఆయన అన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ క్రైమ్లు , మాదక ద్రవ్యాల సంబంధిత నేరాలు ప్రధాన సవాళ్లుగా మారాయని ఆయన పేర్కొన్నారు. ఈ తరహా ఘోర నేరాలు సమాజంలో చోటు చేసుకోకుండా యువ పోలీస్ అధికారులు మరింత అప్రమత్తంగా, సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు.అలాగే, శాంతిభద్రతల పరిస్థితుల్లో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, ఏ పరిస్థితినైనా ఎదుర్కొనే విధంగా సిద్ధంగా ఉండాలని పోలీస్ అధికారులకు ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ పోలీస్ శాఖ ప్రొఫెషనలిజం, ఆవిష్కరణలు మరియు ప్రజా కేంద్రిత పోలీసింగ్ ద్వారా విశిష్ట గుర్తింపు సంపాదించిందని ఆయన పేర్కొన్నారు. ఈ బలమైన పునాదిపై మరింత అభివృద్ధి సాధించేందుకు తాను కట్టుబడి ఉన్నానని తెలిపారు.చట్ట అమలు వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, సాంకేతిక సమీకరణను పెంపొందించడం, కమ్యూనిటీ ఎంగేజ్మెంట్ను మరింత విస్తరించడం తమ ప్రధాన లక్ష్యాలుగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.ప్రజల భద్రతను కాపాడటం, న్యాయాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, అలాగే పోలీస్ సిబ్బంది నైపుణ్యాల అభివృద్ధి మరియు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని ఆయన తెలిపారు.అన్ని స్థాయిల పోలీస్ అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేసి అత్యున్నత ప్రమాణాలతో పోలీస్ సేవలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.అంకితభావం, నిజాయితీ , గౌరవంతో ప్రజలకు సేవ చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## సైబర్ మోసాలు - బాల్యం భద్రం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30(నమస్తే ఉదయం)**




జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మాహిళాభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ, ఆధ్వర్యంలో గురువారం గట్టు మండలం గోర్లఖాన్ దొడ్డి గ్రామంలోని రైతు వేదికలో సైబర్ నేరాలు, పిల్లల భద్రత, రక్షణ మరియు అనాథ పిల్లల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి అదనపు జిల్లా కలెక్టర్ నర్సింగ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంసర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న కారణాలతో విద్యను మధ్యలో ఆపకూడదని, చదువే భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. రాబోయే తరాలు బలంగా ఎదగాలంటే, దేశం అభివృద్ధి చెందాలంటే విద్య ఒక్కటే మార్గమని తెలిపారు. అలాగే, బాలికలు ఎలాంటి అవాంఛనీయ ప్రభావాలకు, ఆకర్షణలకు లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టం వ్యర్థం చెయ్యరాదని కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక నష్టాలు కలుగుతాయని, అలాంటి వివాహాలు నిర్వహించిన తల్లిదండ్రులు, బంధువులు, పురోహితులు, టెంట్ హౌస్ నిర్వాహకులు, సరఫరాదారులు, ఫోటోగ్రాఫర్లు , సహకరించిన వారందరూ చట్టపరమైన చర్యలకు లోనై జైలు శిక్షను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. బాల్య వివాహాల తో శారీరక,మానసిక ఎదుగుదల కుంటు పడుతుందని దీని ప్రభావం రాబోయే తరాల పైన, దేశ ఆర్థిక వ్యవస్థ పైన ప్రభావం చూపుతుందని అన్నారు, చరవాణి వినియోగాన్ని అవసరానికి తగిన విధంగా వాడడం వలన మోసాలను అరికట్టవచ్చని ,ప్రలోభలకు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం ప్రొజెక్టర్ ద్వారా బాలల సురక్షిత- అసురక్షిత పరిస్థితుల పైన, బాలల సంరక్షణ పై, దురలవాట్లను దరి చేయనీయకుండా ఉండడం, మొదలైన అంశాల పైన వీడియోస్ ప్రదర్శన నిర్వహించారు అనాథ, నిరాధార మరియు విడిచిపెట్టబడిన పిల్లల వివరాలను సేకరించి, వారికి విద్యలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అవసరమైన సహాయాన్ని అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మరియు శిశు అభివృద్ధి అధికారి సునంద, ఎంపీడీఓ చెన్నయ్య, డీసీపీఓ నరసింహ, ఎస్సై శేఖర్ గౌడ్, సర్పంచ్ శ్వేత, పంచాయతీ కార్యదర్శి రవి, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ కిరణ్, చైల్డ్ లైన్ సూపర్వైజర్ నవీన్, హబ్ కోఆర్డినేటర్ సరోజ గారు, గ్రామస్థులు మరియు బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు రాజేంద్రనగర్‌లో జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్

**బుద్వేల్, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)**



జెర్సీ లను ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు

రాజేంద్రనగర్ లో జర్నలిస్టులు శుక్రవారం ఆడనున్న క్రికెట్ టోర్నమెంట్ కు సంబందించిన జెర్సీలను సీనియర్ రిపోర్టర్ కరుణాకర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు మేకల దామోదర్రెడ్డి, బి అంజయ్య, ఎం బాలసుబ్రమణ్యం, ఎం ప్రేం రాజ్, గద్దె యాదగిరి తదితరులు మాట్లాడుతూ, నిత్యం బిజీగా ఉండే జర్నలిస్టులు కుటుంబ సభ్యులతో కలసి క్రీడా పోటీలలో పాల్గొనడం సంతోషాన్ని కలుగజేస్తుందన్నారు. శుక్రవారం ఉదయం 6 గంటల కు మొదటి మ్యాచ్ ఆడటం జరుగుతుందని, సాయంత్రం ఫైనల్స్ ఉంటాయన్నారు. మహిళలకు లెమన్ అం డ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, బెలూన్ పోటీలను, చిన్నారులకు డ్యాన్స్ పోటీలను నిర్వహించడం జరుగుతు ందన్నారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరౌతున్నారన్నారు. గౌరవ అతిదులుగా బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు మురళీదర్ అమర్నాథ్, మ్యాడం మదుసూదన్, పంతంగి రమాకాంత శర్మ, షేక్ గౌసుద్దీన్లు హాజరౌతున్నారన్నారు.

# అలింపూర్ గ్రామంలో మిషన్ భగీరథ గుంతలో పడి చిన్నారి మృతి

**అధికారుల నిర్లక్ష్యంతో సంఘటన**

**చిన్నారి మృత దేహంతో గ్రామస్తుల ఆందోళన**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)**







చిన్నారి మృత దేహంతో గ్రామస్తుల ఆందోళన

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం ఆలింపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ ప్రధాన గేటు ముందు మిషన్ భగీరథ పైప్ లీక్ అవుతుందని మరమ్మతుల కోసం 20 రోజుల క్రితం నాలుగు మీటర్ల గుంత అధికారులు తవ్వి ఉంచారని అధికారుల నిర్లక్ష్యంతో అభం శుభం తెలియని ఆడుకుంటూ వెళ్లి మృతి చెందగా అదే స్థలంలో గ్రామస్తులు ఆ చిన్నారి మృతదేహంతో గురువారం ఆందోళన చేశారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అలింపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ ప్రధాన గేటు ముందు మిషన్ భగీరథ పైప్ లీక్ అవుతుంద ని మరమ్మతుల కోసం 20 రోజుల క్రితం నాలుగు మీటర్ల గుంత అధికారులు తవ్వి ఉంచారని, అధికారుల నిర్లక్షానికి ప్రమాదవ శాత్తు ఆ గుంతలో పడిపోయిన ప్రాథమికోన్నత పాఠశాలలోని అంగన్వాడీ ఆయాగా పని చేస్తున్న కవిత అనే మహిళ కూతురు మోక్షిత (5) సంవత్సరాల చిన్నారి గుంతలో పడడం గమనించి, చిన్నారి అక్క దీక్షిత (పెద్ద కూతురు) తల్లికి చెప్పినట్లు తెలిపారు. వెంటనే గుంతలోకి దిగిన తల్లి మోక్షితను బయటికి తీయగా అప్పటికే చిన్నారి మృతి చెందిదని రోదించడం అందరిని కలచివేసింది. మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం వల్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయిందని మృత దేహంతో గ్రామంలోని అన్ని పార్టీల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక సర్పంచ్, గ్రామ మహిళలు అధికారుల నిర్లక్ష్యం పై ఆందోళనకు దిగారు. సంఘటనా స్థలానికి నర్మెట సీఐ అబ్బయ్య, బచ్చన్నపేట ఎస్ఐ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి గ్రామస్తులతో ఆందోళన కార్యక్రమం విరమింప జేశారు.





బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ బి స్వర్ణ కుమారి.. డాక్టర్ కిరణ్మయి ని సన్మానిస్తున్న రంగారెడ్డి జిల్లా అదనపు డాక్టర్ బి స్వర్ణ కుమారి

## రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఎంగా డాక్టర్ బి స్వర్ణ కుమారి

**బుద్వేల్, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)**

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణీ (డీఎంహెచ్ఓ) గా డాక్టర్ బి స్వర్ణ కుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు రంగారెడ్డి జిల్లా డీఎం హెచ్ గా పనిచేసిన డాక్టర్ కె లలితాదేవి చార్మినార్ జోన్ జీహెచ్ఎంసీ కి బదిలీ అయ్యారు. ఈ సం దర్భంగా డాక్టర్ బి స్వర్ణ కుమారి మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా తనకు సుపరిచితమేనన్నారు. జిల్లా లో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా చాలా కాలం పనిచేశానన్నారు. అందరి సహకారంతో రంగారెడ్డి జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి కృషి చేస్తానన్నారు.



యూ సీ డీ విభాగం అధికారులు, సిబ్బంది తో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

## ప్రతి మహిళ పొదపు సంఘంలో సభ్యురాలుగా ఉండాలి సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**బుద్వేల్, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)**

అర్హత కలిగిన ప్రతి మహిళ స్వయం సహాయక సంఘం (ఎస్హెచ్ఐ) లో చేరేటట్లు యూసీడీ విభాగంలో పనిచేస్తున్న అధికారులు, కమ్యూనిటీ ఆరనైజర్లు కృషి చేయాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అత్తాపూర్ సర్కిల్ కార్యాలయంలో గురువారం రాజేంద్రనగర్ జోన్ అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ (యూసీడీ) విభాగం అధికారులు, సిబ్బంది తో ఆయన సమావేశం అయ్యారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో బాగంగా ఈ సమావేశం నిర్వహించారు. అర్హత గల ప్రతి మహిళ కు ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలను అం దేటట్లు చూడాలన్నారు. ప్రస్తుతం జోన్ పరిధిలో 195 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, ఇవి చాలా తక్కువన్నారు. వాటిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం వార్డు స్థాయిలో మహిళలల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించాలని సూచించారు. మహిళల ఆర్థిక సాదికారత కు స్వయం సహాయక సంఘాలు కీలకంగా మారాలన్నారు. ఇందిరమ్మ క్యాంటీన్లను అవసరం ఉన్న చోట్ల కొత్తగా ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్లు డాక్టర్ స్వాతి, కరుణాకర్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు లక్ష్మణ్, విజయ్, విజయేందర్, రేణుక, ఉపేందర్, ముత బియ్య, మాధురి, సునీత, రాములు, సునీత, అరుణకుమారి పాల్గొన్నారు.






## విశ్రాంత ఉద్యోగులు ప్రజాసేవకు కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30(నమస్తే ఉదయం)**

ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత ఉద్యోగులు ప్రజాసేవకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ)గా బాధ్యతలు నిర్వహించి గురువారం ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మీనారాయణ రిటైర్మెంట్ కార్యక్రమంను గద్వాల ఐడిఓసి సమావేశపు మందిరంలో సాయంత్రం ఘనంగా నిర్వహించారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అదనపు కలెక్టర్గా లక్ష్మీనారాయణ జిల్లాలో ఉత్తమ సేవలందించారని, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో పలు ప్రాంతాల్లో రెవెన్యూ విభాగంలో వివిధ హోదాల్లో పనిచేసి పేరు పొందారన్నారు. 30 ఏళ్లకు పైగా సేవలందించిన లక్ష్మీనారాయణ భవిష్యత్తులోనూ ప్రజాసేవకు కొత్త సమయాన్ని వినియోగించాలని సూచించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ అదనపు కలెక్టర్ గా లక్ష్మీనారాయణ జిల్లాలో ఉత్తమ సేవలందించారని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యుల సహకారంతోనే రెవెన్యూ విభాగంలో ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా అన్నింటిని తట్టుకొని ఆయన ప్రశాంత చిత్తంతో విధులు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణను కలెక్టర్ , ఎమ్మెల్యేతో పాటు జిల్లా అధికార యంత్రాంగం, నాయకులు, బంధుమిత్రులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, జిల్లా అధికారులు, పలువురు నాయకులు, ఇతర సిబ్బంది, బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు కృషి

**అడ్వాన్సుడ్ సప్లమెంటరీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు.**

**ఫిన్లాండ్ విద్యా వ్యవస్థ అధ్యయనం గొప్ప అనుభవం.**

**విద్యాశాఖ రాష్ట్రస్థాయి వీసీలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30(నమస్తే ఉదయం)**



అక్షరాస్యత పరంగా వెనుకబడ్డ జోగులాంబ గద్వాల జిల్లాలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే విద్య వారోత్సవాలు, తదితర అంశాలపై గురువారం హైదరాబాదు నుంచి విద్యాశాఖ రాష్ట్ర కార్యదర్శి యోగితా రానా సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2026-2027 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 2700 ప్రభుత్వ పాఠశాలలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్, మరుగుదొడ్లు, తదితర సౌకర్యం లేని పాఠశాలలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంటర్, పదో తరగతిలో ఫెయిల్ అయిన ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో మే 11వ తేదీ నుంచి వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులతో శంకుస్థాపనలు చేయించాలన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను, ప్రజాప్రతినిధులను, అధికారులను భాగస్వాములు చేస్తూ విద్యా శిబిరాలు, వర్క్ షాప్ లు, బడిబాట, తదితర కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. విద్యా వారోత్సవాల కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే ఫిన్లాండ్ దేశంలో విద్యా వ్యవస్థను అధ్యయనం చేసేందుకు జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, విద్యాశాఖ అధికారుల బృందాన్ని అక్కడికి పంపించినట్లు చెప్పారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించేందుకు సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామన్నారు. విద్యాశాఖ అధికారులతో కలిసి ఇటీవల తాను ఫిన్లాండ్ వెళ్లిన అనుభవాలను కలెక్టర్ తెలియజేశారు. ఫిన్లాండ్ దేశంలో ఐదు రోజులపాటు వివిధ విద్యాసంస్థలను సందర్శించామన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగేలా తరగతి గదులతో పాటు ఆవరణలోని అడుగడుగునా విద్యకు సంబంధించిన అంశాలను ప్రదర్శిస్తున్నారన్నారు. తొమ్మిదో తరగతి తర్వాత ఎవరైనా సరే వృత్తి విద్యా కోర్సులు అభ్యసించేందుకు అక్కడ అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ప్రతి తరగతి గదిలో సంబంధిత సబ్జెక్టుకు సంబంధించిన ఒక టీచర్ తో పాటు మరో ఇద్దరు సహాయ ఉపాధ్యాయులు కూడా బోధన చేయడం చూశామన్నారు. తరగతి గదితో పాటు మైదానంలో, విద్యాసంస్థకు సంబంధించిన అన్ని విభాగాల్లో గోడ గడియారాలు ఉండడంతో చాలా చోట్ల బెల్ కు ప్రాధాన్యత ఉండదన్నారు. అంటే విద్యార్థులు తమ టైం టేబుల్ అనుసరించి క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తున్నారన్నారు. డిజిటల్ లెర్నింగ్ లో భాగంగా అక్కడ ఏడవ తరగతి నుంచి విద్యార్థులకు లాప్టాప్ లను అందిస్తున్నారన్నారు. విద్యార్థులు తమ మాతృభాష ఫినిష్ తో పాటు జర్మన్, ఆంగ్ల భాషలు నేర్చుకుంటున్నట్లు చెప్పారు. ప్రాజెక్ట్ వర్కుతోపాటు , లెసన్ ప్లాన్లను పక్కాగా అనుసరిస్తూ అక్కడి విద్యార్థులకు ఉత్తమమైన విద్యా బోధన చేయడం జరుగుతుందన్నారు. ఫిన్లాండ్ దేశంలో అనుసరిస్తున్న విద్యా వ్యవస్థను స్ఫూర్తిగా తీసుకుని జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఇఓ విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారి మైఖేల్, టిజి ఈడబ్ల్యూఐడిసి ఏఈలు మోహన్ రెడ్డి, ఆజాం, తదితరులు పాల్గొన్నారు.



శ్రీ శ్రీ ఫోటో కు నివాళులు అర్పిస్తున్న కవులు, కళాకారులు

## "మరోప్రపంచం" పిలుపుతో తెలుగు కవిత్వానికి కొత్త నడక

**జనగామలో ఘనంగా శ్రీశ్రీ జయంతి వేడుకలు**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం):**

అభ్యుదయ కవితా పితామహుడు, మహాకవి శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) జయంతి వేడుకలు జనగామ జిల్లా కేంద్రంలో శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. కవులు కళాకారుల ఐక్యవేదిక భాగస్వామ్య సంస్థలైన శ్రీశ్రీ కళావేదిక, యువ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని భారత రత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు లగిశెట్టి ప్రభాకర్ అధ్యక్షత జరిగిన ఈ వేడుకల్లో శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలోని అసమానతలపై తన కలంతో యుద్ధం ప్రకటించిన శ్రీశ్రీ రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. "మరోప్రపంచం" పిలుపుతో తెలుగు కవిత్వానికి కొత్త నడక నేర్పిన మహాకవిని స్మరించుకోవడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి.వై.గిరి ఫౌండేషన్ చైర్మన్ జి.కృష్ణ, కవి హృదయం సాహిత్య వేదిక పెట్లోజు సోమేశ్వరాచారి, అభినందన కల్చరల్ సొసైటీ అయిలా సోమనర్సింహాచారి, శ్రీశ్రీ కళావేదిక యువ కమిటీ అధ్యక్షుడు చిలుమోజు సాయికిరణ్, తెలంగాణ గౌడ రచయితల సంఘం గడ్డం మనోజ్ కుమార్, ఆర్.ఎస్.ఆర్.ఫౌండేషన్ రంగరాజు ప్రసాద్, టి.లక్ష్మణ్ గౌడ్, వ్యాఖ్యత డాక్టర్ వేముల సదానందం, మ్యాజిక్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం : ఎమ్మెల్యే గూడెం

**నూతన కోఆప్షన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే**

**పటాన్ చెరు, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం):**

నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టించాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల పరిధిలో గురువారం నిర్వహించిన నూతన కోఆప్షన్ సభ్యుల ఎంపిక అనంతరం.. మున్సిపల్ పాలకవర్గం సభ్యులతో కలిసి నూతనకో ఆప్షన్స్ సభ్యులు ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తమపై నమ్మకంతో కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికకు సంపూర్ణ సహకారం అందించిన ఎమ్మెల్యే కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో ఐదు మున్సిపాలిటీలలో బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టారని,వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మున్సిపాలిటీల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంద్రేశం మున్సిపల్ చైర్మన్ ప్రమీల, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్లు హరీష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు అంతి రెడ్డి, రామచంద్రా రెడ్డి, వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## అంగన్వాడీల సంక్షేమానికి పెద్దపీట: పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**ఉపాధ్యాయులకు మొబైల్ ఫోన్ల పంపిణీ**

**పటాన్ చెరు, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం):**



పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్ చెరు లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 153 మంది ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందించిన మొబైల్ ఫోన్లను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అంగన్వాడి కేంద్రాన్ని డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా ప్రతి అంగన్వాడి ఉపాధ్యాయురాలికి మొబైల్స్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జయరాం నాయక్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, అంగన్వాడి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## ఫలితాలు విద్యార్థుల కష్టం, ఉపాధ్యాయుల అంకిత భావానికి నిదర్శనం

**పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ**

**కూకట్ పల్లి, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)**



పదవ తరగతి ఫలితాలలో ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు ఎంతో కష్టపడ్డారని, ఉపాధ్యాయుల అంకితభావానికి ఇది నిదర్శనం అని పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. 10 వ తరగతి ఫలితాలలో శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ పరిసర ప్రాంతాలలో అగ్ర స్థానంలో విజయ దుందుబీ మోగించిన ప్రజ్ఞ హై స్కూల్ విద్యార్థిని గాండ్ల జ్యోత్మిక కు 600 మార్కులకు గాను 568 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా జ్యోతిక శేరిలింగంపల్లి శాసన సభ్యులు, పీఏసీ చైర్మన్ అరెకేపూడి గాంధీ, 248 వెంకటేశ్వర నగర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డితో కలిసి ఆశీర్వాదం అందించారు. ఈసందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఆ అమ్మాయికి ఇది స్ఫూర్తితో ముందుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డితో పాటు ప్రజ్ఞ వైస్ ప్రిన్సిపాల్ ప్రీతమ్ యాదవ్, జ్యోత్మిక తండ్రి, రాము పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సర్పంచ్

## కాంగ్రెస్ పార్టీలో చేరిన గురవన్నపేట సర్పంచ్ బుడిగె జహంగీర్ గౌడ్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30(నమస్తే ఉదయం):**

ప్రజాపాలనతో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు చూసి ఆకర్షితుడై జనగామ నియోజకవర్గం లోని కొమురవెల్లి మండలం, గురవన్నపేట గ్రామ సర్పంచ్ జహంగీర్ గౌడ్ గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలోజనగామ నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తుందని, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన 6 గ్యారంటీలతో పాటు హామీ ఇవ్వని ఇతర సంక్షేమ పథకాలను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం అమలుకు కృషి చేస్తుందని తెలియజేశారు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా పేద ప్రజల బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడే పార్టీ అని తెలియజేశారు గ్రామాభివృద్ధి కోసం జహంగీర్ గౌడ్ పార్టీలో చేరడం గ్రామ అభివృద్ధికి బాట వేసినట్టు అయ్యిందని గ్రామ అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారాన్ని అందిస్తారని అలాగే గ్రామ సర్పంచ్ చేరిక పార్టీకి మరింత బలాన్ని చేకూర్చుతుందని తెలియజేశారు. సర్పంచ్ జహంగీర్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందిస్తున్న సేవలు తనను ఆకట్టుకున్నాయని, గ్రామ అభివృద్ధి కోసం పార్టీలో చేరానని అధికార పార్టీ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్తానని అలాగే ఇకపై పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, పాక్స్ మాజీ ఛైర్మెన్ మెరుగు కృష్ణ, గురువన్నపేట గ్రామ శాఖ అధ్యక్షులు బ్రహ్మాండ్లపల్లి చంద్రం, మాజీ ఎంపీటీసీ బుడిగే ఐలేని గౌడ్, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బొచ్చు ఎల్లయ్య, మండల పార్టీ సేవాదళ్ అధ్యక్షులు బుడిగే అశోక్, మండల పార్టీ సెక్రటరీ బుడిగే బిక్షపతి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏర్పుల రాజు, గొదల నవీన్, బుడిగే హరీష్, మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భాషిత జూనియర్ కాలేజి ఎలాంటి ఫైర్ సేఫ్టీ లేకుండా ఐదు అంతస్తుల భవన నిర్మాణం

**కాలేజ్ భవనాన్ని వెంటనే సీజ్ చేయాలి...యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి.. ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర నాయకులు గొల్ల జాన్**

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)**




తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ తరఫున మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా అగ్నిమాపక అధికారి (డీఎఫ్ఓ)కు చింతల్‌లో ఉన్న భాషిత జూనియర్ కాలేజ్‌పై అత్యవసరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర నాయకులు గొల్ల జాన్ గురువారం ఫిర్యాదు నమోదు చేశారు. సదరు కాలేజ్ తప్పనిసరి ఫైర్ ఎన్ఓసి లేకుండా ఐదు అంతస్తుల భవనాన్ని అక్రమంగా నిర్వహిస్తూ, ప్రాథమిక అగ్నిసురక్షా నిబంధనలను ఘోరంగా ఉల్లంఘిస్తోంది. ఇది కేవలం నియమాల ఉల్లంఘన మాత్రమే కాకుండా, వందలాది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న తీవ్రమైన నిర్లక్ష్యం. ఈ విషయంపై ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్ ఇప్పటికే ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి, జిల్లా కలెక్టర్, ఇతర సంబంధిత శాఖల అధికారులకు పలు ప్రాతినిధ్య పత్రాలు సమర్పించి, తక్షణ జోక్యం చేసుకోవాలని కోరారు. అధికారులు వెంటనే స్పందించకపోతే, ఇది స్పష్టమైన పరిపాలనా వైఫల్యంగా పరిగణించబడుతుంది. ఏదైనా అనర్థం సంభవించిన పక్షంలో, కాలేజ్ యాజమాన్యం తో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కూడా పూర్తి బాధ్యత ఉంటుంది.

**తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ డిమాండ్లు**

కాలేజ్ భవనాన్ని వెంటనే సీజ్ చేయాలి, యాజమాన్యంపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి, సంబంధిత అధికారుల బాధ్యతను నిర్ధారించి చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ స్పష్టం చేస్తోంది. అవసరమైతే, ఈ అంశంపై మరింత తీవ్ర ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరిస్తోంది.



అధికారులతో సమీక్షా చేస్తున్న జిల్లా కలెక్టర్

## జిల్లాలోని సరిపడా ఇంధన నిల్వలు

**క్యాన్లలో ఇంధన విక్రయం నిషేధం.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30(నమస్తే ఉదయం):**

జిల్లాలోని అన్ని పెట్రోల్, డీజిల్ బంకుల వద్ద సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా పరిస్థితులపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకుల్లో ఇండెంట్ విధానం, ఇంధన విక్రయాల వంటి అంశాలపై సమగ్రంగా చర్చించి, పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ఏమాట్లాడుతూ.. జిల్లాలో ఇంధన కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయిల్ కంపెనీల ద్వారా నిరంతరం సరఫరా జరుగుతోందని, బంకుల వద్ద నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని, కూపన్ల వినియోగాన్ని అమలు చేయాలని, ముఖ్యంగా రైతులకు అందించే 25 లీటర్ల ఇంధన పరిమితి (కల్టివేటర్లు ఒ హార్వెస్టర్లకు) విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని తెలిపారు. స్టాక్ వివరాలు, రికార్డులు సరైన విధంగా నిర్వహించాలని, అన్ని పెట్రోల్ బంకులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంధన సరఫరా వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా పెట్రోల్ బంకుల వద్ద క్యాన్లలో ఇంధనం ఇవ్వకూడదన్నారు. దీనిని ప్రతి బంకు నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాల్సిన బాధ్యత ఉందన్నారు. జిల్లా పౌరులకు విజ్ఞప్తి చేస్తూ.. అవసరమైన మేరకు మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని, అనవసరంగా నిల్వ చేయకుండా సహకరించాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డీఏఓ అంబికా సోనీ, విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, డీఎం సీఎస్ హాథీరామ్, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్, తూనికలు, కొలతల శాఖ అధికారి ఝాన్సీ, ఇతర సంబంధిత అధికారులు, పెట్రోలియం డిస్ట్రిబ్యూటర్లు, తదితరులు పాల్గొన్నారు.



యెన్నకుస నవ్య 540/600 ఆకులపెల్లి అఖిల 530/600 గుగులోత్ వైశాలి 527/600

## పదవ తరగతి ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాలకుర్తి టిజిడబ్ల్యూఆర్ఎస్ (వెలుగు) పాఠశాల

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (నమస్తే ఉదయం)**

పదవ తరగతి పరీక్ష ఫలితాలలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల/పాఠశాల (వెలుగు) (బాలికలు) పాలకుర్తి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ స్వరూప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాల నుండి 78 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 78 మంది 100 కు వంద శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు యెన్నకూస నవ్య 540/600 మొదటి స్థానం, అకులపెల్లి అఖిల 530/600 రెండవ స్థానం, గుగులోత్ వైశాలి 527/600 మూడవ స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వరూప మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదల, కఠోర శ్రమ, ఉపాధ్యాయ బృందం శిక్షణ, పేరెంట్స్ కమిటీ, తల్లిదండ్రుల సహకారంతో వంద శాతం సాధించామని, భవిష్యత్ లో విద్యార్థులు చదువుకున్న సంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.